**కథ**

# అమ్మ నిర్ణయం

**ఎ.అంజలి**

**ఉపాధ్యాయ వృత్తినుండి రాజమల్లయ్య రిటైర్ అయ్యాడు.**

**ఉపాధ్యాయుడిగా తన జీవితాన్ని స్కూలు పిల్లలకే అంకితం చేశాడు.**

**తండ్రిగా జీతాన్ని తన పిల్లల చదువులకే ధారపోశాడు. రిటైరయ్యేనాటికి తనకంటూ స్వంతంగా ఒక్క నయా పైసా దాచుకోలేదతను. అసలేనాడు అతనికి బ్యాంక్ బ్యాలెన్స్ లేదు, తెలీదు.**

భార్య గంగమ్మ కూడా రాజమల్లయ్యకు సరైన జోడి. ఉత్తమ ఇల్లాలు. నోరు తెరిచి ఏరోజూ ఆమె తనకై ఏదీ భర్తని కోరలేదు. సగటు ఇల్లాలుగా ఏ విషయంలోనూ భర్తని నిలదీసింది లేదు. ఆయన ఎంత చెబితే అంత 'ఊ' అనడం తప్పితే వ్యతిరేకించడం ఎరుగదు. ముప్పై సంవత్సరాల వైవాహిక జీవితంలో అతను భార్యకి మంగళసూత్రం మినహా ఒక్క నగ కొనిపెట్టిందీ లేదు. ఆమె కూడా సర్దుకుపోయింది.

అందుకే రిటైరయ్యాక డబ్బులు రాగానే అందులోంచి యాభైవేలు విలువ చేసే ఆభరణాల్ని భార్యకి కొనిచ్చాడు. ''ఈ వయసులో ఇవన్నీ ఎందుకు'' అని మొదట ఆమె వారించినా, మనసులోని కోరిక ఇన్నాళ్లకి తీరడంతో ముచ్చటపడింది. మరో యాభై వేలు భార్యపేర ఫిక్స్ కూడా చేశాడు. మిగిలిన డబ్బుల్ని ఇద్దరు కొడుకుల చదువులకై చేసిన అప్పుల్ని తీర్చేశాడు.

ఉపాధ్యాయుడిగా రాజమల్లయ్య అంకితభావం తాలూకు ప్రభావం అతడి పిల్లలపై పడి ఇద్దరూ ప్రయోజకులయ్యారు. అతను రిటైరవగానే మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. జీవితానికిదే చాలనుకున్నారాయన. భార్య కూడా భర్త సంతోషాన్ని పంచుకుంది.

అయితే గంగమ్మకి ఆ మురిపెం ఎన్నో రోజులు నిలువలేదు. భర్త గుండెపోటుతో ఆమెకి వైధవ్యం ప్రాప్తించింది. అలా ఆమె తన ఇద్దరు కొడుకుల పంచన చేరాల్సి వచ్చింది.

భర్త మరణం గంగమ్మని కృంగదీసినా, పిల్లల ఆదరణ ఆమెకి సంతృప్తిని మిగిల్చింది. కొందరిలా కొడుకులిద్దరూ తల్లిని పంచుకోలేదు. ఆమె మాత్రం నెల నెలా తనకి వచ్చే పెన్షన్ డబ్బుల్ని కొడుకులకి సమంగా పంచుతోంది. ఏ కొడుకు దగ్గర ఎన్ని రోజులు ఉండాలనిపిస్తే అక్కడే అన్ని రోజులు నిశ్చింతగా కాలం గడుపుతోంది.

★ ★ ★

ఓ సాయంత్రం వేళ-

''నాన్నగారు పోయాక బాగా చిక్కిపోయావమ్మా!'' అంటూ వచ్చి తల్లి పక్కన చేరాడు పెద్ద కొడుకు ప్రేమ్. స్వయంగా భర్తే తనని ప్రేమగా పలకరిస్తున్నట్లనిపించింది గంగమ్మకు. రాజమల్లయ్యకు జిరాక్స్‌లా ఉంటాడు ప్రేమ్.

చప్పున భర్త గుర్తుకొచ్చాడామెకు.

''ఎర్రగా దబ్బపండులా వుండేవారు. సన్నగా పొట్లకాయలా ఎలా అయిపోయారు'' కోడలు రేఖ సైతం అత్తపట్ల ఆత్మీయతని ప్రదర్శించింది.

''తోడు లేని పక్షిని. పైగా ముసలితనం. అయినా ఆయనే పోయాక నేనెలా ఉంటే ఏం?'' గంగమ్మ నిర్లిప్తతగా బదులిచ్చింది.

''అలా ఎందుకంటావమ్మా! నీకు తోడు నేనున్నాను, తమ్ముడున్నాడు, మనవళ్ళు, మనవరాళ్ళు...అంతా లేమూ?'' ప్రేమ్ అనునయంగా అన్నాడు.

''అందుకేగా నేనింకా బతికే ఉంది'' అందామె.

''ఇదిగో ఈ పండ్లు తిను'' బల్లమీద పెట్టిన ప్యాకెట్‌ని చూపిస్తూ చెప్పాడు ప్రేమ్.

''కోడలు రోజా ఏదో ఒక జ్యూస్ ఇస్తోంది కదరా. మళ్లీ ఇవన్నీ ఎందుకు చెప్పు?'' అందామె.

''ఫర్వాలేదత్తయ్యా! పిల్లలతో పాటు మీకు..'' కోడలు రేఖ అంది.

''నాన్నగారు లేరన్న దిగులు నీలో కన్పించకూడదన్నదే మా తాపత్రయమమ్మా!'' గంభీరంగా అన్నాడు ప్రేమ్.

ఆ అభిమానానికి గంగమ్మ గుండె నిండుకుంది.

★ ★ ★

భోజనాల దగ్గర-

''రోజు రోజుకీ తిండి తగ్గిపోతోందమ్మా! మరీ చిన్నపిల్లలా భోం జేస్తున్నావు'' చిన్న కొడుకు కరుణాకర్ చిన్నప్పటిలా బుంగమూతి పెడ్తుంటే ముచ్చటేసింది గంగమ్మకు.

'పిచ్చితండ్రి, అచ్చు తన పోలికే! భర్తని తను కూడా ఇలాగే నిలదీసేది. కంచంలో ప్రేమగా మరింత వడ్డించేది. వారించినా వినేది కాదు' ఒక జ్ఞాపకం ఆమె గుండెని స్పృశించింది సమీరంలా.

''నాన్నగారు పోయారని మాకు మాత్రం బాధగా లేదూ? అంత మాత్రాన తిండి మానేస్తే ఎలాగమ్మా?'' తిరిగి అన్నాడతనే.

బదులుపలుక లేదు.

''మీరు ఈ వయసులో కూడా ఆరోగ్యంగా ఉండడం నిజంగా మా అదృష్టమే అత్తయ్యా! మావయ్య మీద దిగులున్నా, మరి ఆరోగ్యం కాపాడుకోవడానికైనా ఓ ముద్ద తినాలి కదా!'' కోడలూ కూతురై అభిమానంతో మందలిస్తోంది.

''ఆయనే లేరు. ఏం తిన్నా ఎంత తిన్నా జీవచ్ఛవంలా బతకడమేగా?'' పెదవి విప్పింది గంగమ్మ.

''నిజమేనమ్మా! నాన్నెలాగూ లేరు. కళ్ళముందున్న నీవైనా కనీసం కళకళలాడుతూ తిరిగితే మాకదే ఆనందం కదమ్మా!'' అంటూ కొసరి కొసరి వడ్డిస్తున్న చిన్నబ్బాయిని చూసి గంగమ్మ మనసు పొంగిపోయింది.

ఆ అనురాగం ఆమెని కట్టిపడేసింది.

కోడళ్ళు కూడా కొడుకులకి ఏం తీసిపోకుండా తనని ప్రేమగా చూసుకుంటున్నారని ఇరుగుపొరుగు వాళ్ళకి ఆనందంగా చెప్పుకునేది.

'ఎంత చక్కని సంతానాన్నిచ్చావయ్యా!' తృప్తిగా అనుకుంటూ పైలోకాన ఉన్న భర్తని తలుచుకుని ఆనందభాష్పాలు రాల్చేది గంగమ్మ.

అలా అందరి ఆదరాభిమానాలతో ఆమె వార్థక్యం ఓ ఆరునెలల పాటు సుఖమయంగా గడిచిపోయింది.

అలాంటి తరుణంలో..

ఊహించని విధంగా-

ఆ గంగమ్మ తల్లి గుండె అట్టడుగు పొరల నుండి..ఒక విషాదపు సునామీ ఆమె కనుకొనల తీరానికి అశ్రుకణాలని చేరవేసింది.

జీవితమనే నాణానికి బొమ్మా-బొరుసు రెండూ ఉంటాయని తొలిసారిగా ఆమెకి తెలిసి వచ్చింది.

★ ★ ★

తెల్లవారు ఝామున గంగమ్మకి ఎందుకనో మెలుకువ వచ్చింది.

దాహంగా అన్పించి మంచి నీళ్ళకోసమని వెతికింది. 'రాత్రి తన గదిలో నీళ్ళు పెట్టడం కోడలు



మరిచిన ట్టుంది' అనుకుంటూ వంటగది లోకి వెళ్తుంటే దారిలో ఉన్న బెడ్ రూమ్ నుండి గట్టిగా మాటలు వినప డ్డాయి.

వినడం సభ్యత కాదని మనసు వారిస్తున్నా కదల మని కాళ్ళు మొరాయించాయి. అసంకల్పితంగా ఆగిపోయింది.

''ఇక ఈ జన్మలో మీరు చంద్రహారం చేయించే టట్లు కనబడడం లేదు'' విసుగ్గా అంటోంది. ఆ గొంతు పెద్ద కోడలు రేఖది.

కొద్దిసేపు నిశ్శబ్దం...

''అబ్బా! కాస్త ఓపిక పట్టవే? తొందర్లోనే ఎలా గైనా అమ్మ నగలతో నీ కోరిక తీరుస్తానుగా!'' ఆ గొంతు పెద్దబ్బాయి ప్రేమ్‌ది.

''ఏం చేయించ డమో ఏమో? అదిగో ఇదిగో అంటూ నెలలకి నెలలు గడిచిపోతున్నాయి. మీరు కూడా మీ నాన్న లాగే రిటైరయ్యాక నగలు కొనిపెట్టార్లా ఉంది. అయినా దేనికైనా రాసిపెట్టి ఉండాలంటారు'' ఆమె ప్రతి మాటలో నిరసన.

''నీ మొండిపట్టు నీదే! చెబితే వినవు. అన్నప్పుడే కావాలంటే ఎలా? మన చేతిలో పనా! అమ్మ నగ లతో వ్యవహారం'' సర్ది చెబుతున్నాడు.

''అయినా విధవరాలై వుండీ మీ అమ్మ తగుదు నమ్మా అంటూ ఆ నగలు దిగేసుకుని తిరగడమేం టండీ! విడ్డూరం కాకపోతే? ఇరుగూ పొరుగూ ముసల్దానికి నగల మీదెందుకింత మోజు? అని చెవులు కొరుక్కుంటుంటే భరించలేకుండా ఉన్నాను'' తన మనసులోని మాటని ఇరుగుపొ రుగు వంకతో కోడలు కొడుకు ముందు బైటపెడు తుంటే వికారం కల్గింది గంగమ్మకు.

''నా మరణానంతరం కూడా ఈ నగలు నీ శరీరం నుండి తీయొద్దు. ఇది ముందు చూపుతో చెబుతున్నా. నా ప్రేమ చిహ్నంగానైనా ధరించు..''

చనిపోతూ భర్త అన్న మాటలు ఆ సమయంలో గంగమ్మకు గుర్తుకు వచ్చాయి.

'అలాంటిది నాకు నగల మీద మోజేంటి? భర్త చివరి కోరిక ప్రకారం నగలు తీయడం లేదంతే!' ఆమె మనసు పరితపించింది.

''ఏది ఏమైనా అమ్మకి మాత్రం ఎవరున్నారని? ఆమె పోయాక మీ తోడికోడళ్ళిద్దరికేగా ఆ నగలు?'' అబ్బాయి చెబుతున్నాడు.

''భలే వారండీ! ఆవిడ పోయాకనా? ఇంకా నయం. గుండ్రాయిలా ఉంది ఆవిడెప్పుడు పోతుందండీ?'' నిట్టూర్పుగా అంది.

పెద్ద కోడలు మనోగతానికి గంగమ్మ గుండె పేలిపోలేదు. ఉబికి వస్తున్న కన్నీళ్ళని అదిమేసింది.

దాహం మాట మరిచి గిర్రున వెనుతిరిగింది.

★ ★ ★

గురువారం దగ్గర్లో ఉన్న సాయిబాబా గుడికి వెళ్ళింది గంగమ్మ. ప్రతి వారం భజన కార్యక్రమంలో పాల్గొనడం ఆమెకి అలవాటయ్యింది. అలా సాయంత్రం ఒక గంటసేపు దేవాలయంలో గడిపి ఇంటికి తిరిగొస్తుంది. అప్పుడే తిరిగి రాదనే భావనతో చిన్నబ్బాయి, కోడలు హాల్లోనే కూర్చుని గట్టిగానే మాట్లాడుకుంటున్నారు.

కానీ సడెన్‌గా తలనొప్పి మొదలవ్వడంతో దైవదర్శనం పూర్తవుతూనే, భజనలో పాల్గొనకుండా వెనుదిరిగివచ్చేసింది గంగమ్మ.

తన ప్రసక్తే వాళ్ళ మాటల్లో దొర్లడంతో గుమ్మం దగ్గరే ఆగిపోవాల్సి వచ్చింది. నిశ్శబ్దంగా వింటుండిపోయింది వాళ్ళ మాటల్ని.

''ఎదురింటి వనజాక్షి ఇండికా కారుందని తెగ ఫోజు కొడుతోందండీ! మనం ఎట్లీస్ట్ మారుతి కారైనా కొనుక్కుందామండీ!'' చిన్న కోడలు సునంద కొడుకుతో గారాలు పోతోంది.

''ఎదురింటి వాళ్ళ ప్రసక్తెందుగ్గానీ, కారెలాగూ కొనుక్కుందామనుకున్నాం. అయినా ఇప్పుడిప్పుడే అంటే ఎలా? అంత డబ్బెక్కడుంది?'' కరుణాకర్ భార్యతో అంటున్నాడు.

''బ్యాంక్‌లో కొంత ఎమౌంట్ ఉందిగా. డబ్బు తగ్గితే మీ అమ్మనడగండి. ఆమె పేరిట కూడా ఉందిగా. అయినా డబ్బుంచుకుని తెగ నీల్గుతోంది ముసల్ది. నేనేం చేసుకుంటానురా అబ్బాయ్ అంటూ ఇవ్వొచ్చుగా?'' రుసరుస లాడింది.

''నిజమే కానీ ఆ డబ్బు మీద అన్నయ్యకీ హక్కుంటుంది. చెరిసగం కదా! ఆ డబ్బు రావాలంటే తొందరపడి లాభం లేదు'' అన్నాడు కరుణాకర్.

''తొందరపడకుండా యుగాలు వేచి చూడాలంటారా? ఇప్పటికే ఓవరైపోతోంది. మీ అమ్మతో ప్రేమవొలక బోస్తూ నటించడం ఇక నా వల్ల కాదండీ! ఏదో పోన్లే ఒంటి మీద నగలున్నాయి, బ్యాంకులో కొంత క్యాష్ ఉంది అని అనుకుంటే...నగలు తీయదు, డబ్బివ్వదు. అలాంటప్పుడు ఆమెని మీదేసుకొని ఆమె భారం మనం మోయడం దేనికి?'' తన నిజ స్వరూపం బయటపెడ్తోంది సునంద.

చిన్నకోడలి మాటలు వింటుంటే గంగమ్మ కాళ్ళకింద భూమి కదిలిపోలేదు. గుండె దిటవు చేసుకుంది.

తాడు లాగే పందెంలా...

కొడుకులిద్దరూ భార్యలతో జంటలుగా చెరో వైపు చేరి తన చేతులు పట్టుకొని లాగుతుంటే నిలువుగా చీలుతున్న భావన!

★ ★ ★

పై రెండు సంఘటనలు జరిగాక గంగమ్మ వారం, పదిరోజులు ఎవరికీ కనబడకుండా పోయింది.

అమ్మ కనబడకపోతే కలవరపడతారో లేదో కానీ..తనకోసం వెతకవద్దని చెప్పమని ఇద్దరింట్లలోనూ మనుమలకి, మనుమరాండ్లకి చెప్పి వెళ్ళిందామె.

ఆ అమ్మ తిరిగొచ్చాక-

''ఎటు వెళ్ళావమ్మా?'' అని ఏ కొడుకూ ఆసక్తి కనబరచలేదు. ఆరా తీయనూ లేదు.

''నీ ఒంటి మీది నగలేమయ్యాయని?'' ఆందోళనగా అడిగారు. మూకుమ్మడిగా నిలదీశారు.

గంగమ్మ ఊహ బలపడింది. తన పుత్రులు రత్నాలు కాదు రాళ్ళని, కోడళ్ళు మేలిమి బంగారం కాదు మేడిపండు చందమని తేటతెల్లమయ్యింది.

గంగమ్మ..గంగా నదీమ తల్లిలా గంభీరంగా ఉండిపోయింది.

కోడళ్ళు కూడా రెట్టించేసరికి పెదవి విప్పింది.

''నగల మీది మోజు, నా మీద కపట ప్రేమని కురిపిస్తుంటే పసిగట్టలేకపోయిందీ అమ్మ. అమ్మ కోసం కాకుండా అమ్మ నంటిపెట్టుకొని ఉన్న డబ్బు కోసం మీ ఆరాటం చూసాక తట్టుకోలేకపోయిందీ గుండె. 'గంగమ్మా!' అని అందరిచేతా పిలవడ్డ ఈ గంగ మరి అందరికీ అమ్మే! అందుకే 'అమ్మ'గానే ఆలోచించాను. అనాథ శరణాలయ పిల్లలకోసం నా నగలన్నీ ధారపోశాను. కన్నపిల్లల నిరాదరణకి గుర్రై కొడిగట్టిన దీపాల్లా మిణుకుమిణుకుమంటూ జీవనం గడుపుతున్న అభాగ్యులైన వృద్ధాశ్రమవాసులకై బ్యాంకు డబ్బు సమర్పించాను.

మీ మనసులో వీసమెత్తయినా లేని మీ నాన్నగారి పేరు కనీసం శిలాఫలకాలపైనన్నా ఉండాలని ఆయన పేరు మీదే విరాళాలుగా ఇచ్చేసాను. మునుపటిలా మీరు ఆదరిస్తారా అమ్మగా మీ చెంతే ఉంటాను. 'రాజమల్లయ్య సారు చనిపోయి ఏడాదైనా కాలేదు. అప్పుడే తల్లిని ఇంట్లోంచి వెళ్ళగొట్టారు' అనే అపవాదు మీకు రాకూడదనే తలంపుతోనే తిరిగివచ్చాను. వద్దంటే వెళ్ళి వృద్ధాశ్రమంలో శేషజీవితం గడిపేస్తాను.

అమ్మ...ప్రేమకి నిలయం. ప్రేమలేని ఏ చోటూ అమ్మకి నిలయం కాకూడదు. అందుకే నా యీ నిర్ణయం..''

కోడళ్ళు తెల్లమొహాలు వేశారు.

కొడుకులిద్దరూ ఆలోచనల్లో పడ్డారు.

## సూపర్‌గర్ల్

**బాల్యం ఓ మధురస్వప్నం. ఎందుకంటే బాల్యంలో చేసిన అల్లరి గుర్తుకువస్తే ఆనందం, మళ్లీ ఆ రోజులు రావుకదా అన్న విచారం మనల్ని చుట్టుముట్టేస్తాయి. 'బాల్యంలో సరదాగా ఆడుకుంటూ, పాడుకుంటూ గడపడం ఎంత మందికి సాధ్యం. ఈరోజుల్లో పిల్లలకి స్కూల్, హోంవర్క్, ర్యాంక్‌ల గోల ఎక్కువైపోయింది. మారోజుల్లో అయితే నేను ఎక్కువగా కార్టూన్ ప్రోగ్రాంలు ఎక్కువగా చూసేదాన్ని. నన్నంతా సూపర్‌గర్ల్ అనేవారు' అంటూ తన బాల్యాన్ని గుర్తుచేసుకుంది ప్రీతీజింతా.**

